

బోధన్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, కేంద్ర బలగాలు


మహారాష్ట్రలోని బెల్లూర్ చెక్ పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

# ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

- ప్రజలకు పోలీసుల భరోసా
- బోధన్‌లో కేంద్ర బలగాల కవాతు

శక్కర్‌నగర్, అక్టోబర్ 27: వచ్చేనెలలో అంసెబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా పోలీసులు బోధన్ పట్టణంలో శుక్రవారం కవాతును నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి పట్టణంలోని రాకాసిపేట్ భీముని గుట్ట తదితర ప్రాంతాల్లోని ప్రధాన వీధుల గుండా ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సుమరు 500 మంది కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో కవాతు కొనసాగింది. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ ర్యాలీని నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ పర్యవేక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా కొనసాగించే దిశగా ప్రజలకు భరోసా కల్పించాలని పోలీస్ అధికారులకు సీపీ సూచించారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, నిజామాబాద్ లా అండ్ ఆర్డర్ డీసీపీ జయరాం, అదనపు డీసీపీ గిరిరాజ్, సీఐలు ప్రేమ్ కుమార్, శ్రీనివాస్‌రాజు, జయశ్వర్‌తో పాటు డివిజన్ లోని ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేయాలి : సీపీ

రెంజల్, అక్టోబర్ 27: తెలంగాణలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద సిబ్బంది సమన్వయంతో పని చేయాలని నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ ఆదేశించారు. కందకుర్తి సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు, మహారాష్ట్ర సరిహద్దులో ధర్మాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెల్లూర్ చెక్ పోస్టును సీపీ కల్మేశ్వర్ వేర్వేరుగా తనిఖీ చేశారు. వాహనాలను నమోదు చేసే రిజిష్టర్‌ను పరిశీలించారు. అన్ని వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద 24 గంటల పాటు వివిధ శాఖల సమన్వయంతో నిరంతరంగా తనిఖీలు కొనసాగుతాయని అన్నారు. ప్రజలు సహకరించాలని సీపీ కోరారు. బెల్లూర్ చెక్ పోస్టు ప్రారంభించిన నుంచి ఇప్పటి వరకు పట్టుబడిన నగదు, మద్యం వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ శ్రీనివాస్‌రాజ్, రెంజల్ ఎస్సై పి.ఉదయ్‌కుమార్ ఉన్నారు.

## బోధన్ ఎమ్మెల్యేగా షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా

బోధన్, అక్టోబర్ 27: స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా శుక్రవారం బోధన్ పట్టణంలోని 8వ వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రణాళిక కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయేషా ఫాతిమా మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి లబ్ధిచేకూరేలా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని అన్నారు. మరోసారి కేసీఆర్‌ను సీఎంగా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని, ఎమ్మెల్యేగా షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి కోరారు. ఆమె వెంట కౌన్సిలర్ షంషుద్దీన్ బేగం, బీఆర్‌ఎస్ నాయకులు అశ్వాక్ అలీ, ఎన్‌ఆర్‌ఐ బాబా, సయ్యద్ ఆరీఫ్, మహ్మద్ ఆయూబ్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి పూజలు


ఆలయంలో ఆర్మూర్ ఎమ్మెల్యే సతీమణి రజితా రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వినిత

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్27: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఆంజనేయ ఆలయంలో ఉన్న దుర్గామాతకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినిత పాల్గొని లలిత సహస్ర నామాలు పఠించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వరలక్ష్మి లింబాద్రి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా చెక్‌పోస్టల వద్ద తనిఖీలు


కమ్మర్‌పల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 27: ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్, జగిత్యాల జిల్లాల సరిహద్దులో 63వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో శుక్రవారం పలు వాహనాలను చెక్‌పోస్ట్, ఎస్‌ఎస్‌పీ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి రోజూ 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## 'వర్క్‌షాప్'లో సుర్భి ర్యాల్ విద్యార్థిని ..



వర్క్‌షాపునలో విద్యార్థిని సాయిచరణి, గైడ్ టీచర్ రఘునాథ్

ఆర్మూర్, అక్టోబర్27: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ మండలం సుర్భిర్యాల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాయిచరణి తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) రాష్ట్రస్థాయి వర్క్‌షాపునకు ఎంపికైంది. పాఠశాల గైడ్ టీచర్ పుసుపుల రఘునాథ్ ఆధ్వర్యంలో విద్యార్థిని రూపొందించిన కరెంట్ లేకుండా బ్రిక్స్ లిఫ్టింగ్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ ప్రాజెక్టును ఆగస్టు 15న నిజామాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రదర్శించి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని సాయిచరణి అందుకుంది. ప్రాజెక్టును మరింత అభివృద్ధి చేయడానికి అధికారులు ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం నారాయణ తెలిపారు.

## పోలింగ్‌స్టేషన్ పరిశీలన

బాల్కొండ, అక్టోబర్ 27: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పోలింగ్ స్టేషన్‌ను ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పనులను పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, ఎంఈవో రాజేశ్వర్ ఉన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి


విలేకరులతో మాట్లాడుతున్న అమర్‌నాథ్‌బాబు

నవీపేట, అక్టోబర్ 27: కాంగ్రెస్, టీడీపీ హయాంలో బోధన్ నియోజకవర్గ అభివృద్ధి శూన్యమని, బీఆర్‌ఎస్ హయాంలోనే నియోజకవర్గంలోని పట్టణంతోపాటు అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాయని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, పెంటకలాన్ సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఐదేండ్లు మంత్రిగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఆకర్షితుడనై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మంత్రి కేటీఆర్ సమక్షంలో తాను 2019లో బీఆర్‌ఎస్‌లో చేరినట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు సాయన్న, సాయిలు, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ సర్కారు కృషి


సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు, దివ్యాంగులు

నవీపేట, అక్టోబర్27: ఉమ్మడి రాష్ట్రంలో గత పాలకులు దివ్యాంగులను పట్టించుకోలేదని, స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత దివ్యాంగుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్ద పేట వేసిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు తెడ్డు పోశెట్టి, దొంత ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దాస్ గెస్టుహౌస్‌లో ఏర్పాటు చేసిన దివ్యాంగుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నో ఏండ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడూ దివ్యాంగుల ఆర్థిక పరిస్థితులను పట్టించుకోలేదని పేర్కొన్నారు. దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా ఉండాలని, స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి మమ్మద్ షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని వారు కోరారు.

### షకీల్‌ను భారీ మెజారిటీతో లిపించుకుంటాం..

తమ అభ్యున్నతికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి తమ మద్దతు ఉంటుందని, కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని దివ్యాంగుల సంఘం పట్టణ అధ్యక్షుడు బయ్య సతీశ్, ఆ సంఘం మండల ప్రతినిధులు రాము, లక్ష్మణ్, రమణ, రాజు, లక్ష్మి అన్నారు. దివ్యాంగుల సంఘం సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆసంఘం పట్టణ అధ్యక్షుడు బయ్య సతీశ్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్ రావు, పార్టీ నాయకులు తెడ్డు పోశెట్టి, దొంత ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బీఆర్‌ఎస్ నాయకుడు కరిపె మల్లేశ్, యువజన సంఘం మండల అధ్యక్షుడు మంత్రి సాయికుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు బి.సూరిబాబు, శ్యామ్, జావీద్, దివ్యాంగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీబీఏ కోర్సుపై విద్యార్థులకు అవగాహన


రాజేందర్‌సింగ్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ఆర్మూర్, అక్టోబర్27: పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాలలో బీబీఏ అనుబంధ కోర్సులపై విద్యార్థులకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సుకు జాయింట్ డైరెక్టర్, కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డి.రాజేందర్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై బీబీఏ కోర్సు ప్రాధాన్యం, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల యాజమాన్యం తరపున సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సంజీవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత


ఫోన్‌ను అప్పగిస్తున్న రాణి

బోధన్ రూరల్, అక్టోబర్ 27: ఆర్టీసీ బస్సులో ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా బోధన్ అసిస్టెంట్ డిపో కంట్రోలర్(ఏడీసీ) బీఏ రాణి తిరిగి ఆ వ్యక్తికి శుక్రవారం ఫోన్‌ను అందించారు. ఆర్టీసీ అధికారుల కథనం మేరకు.. బోధన్‌కు చెందిన శుభం అనే వ్యక్తి జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో జూనియార్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ మేరకు విధుల్లో భాగంగా శుక్రవారం ఉదయం బోధన్ ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సులో ప్రయాణించిన శుభం తన సెల్ ఫోన్‌ను బస్సులో పోగొట్టుకున్నాడు. అదే బస్సులో ప్రయాణం చేస్తున్న బోధన్ డిపో ఏడీసీ బీఏ రాణి బస్సు సీటుపై ఉన్న సెల్ ఫోన్‌ను గుర్తించి వివరాలు తెలుసుకొని బాధితుడికి అందించారు.